
సాక్షి
బాపట్ల
గురువారం । 17 । అక్టోబర్ । 2024



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద బుధవారం 1516, బ్యాంక్ కెనాల్‌కు 257 క్యూసెక్కులు విడుదల చేశారు.



హుండీ లెక్కింపు ప్రారంభం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దసరా వేడుకల నేపథ్యంలో దుర్గమ్మ హుండీ కానుకలు లెక్కింపు మొదలుపెట్టగా.. రూ. 3.50 కోట్లు, 272 గ్రా. బంగారం వచ్చాయి.



24 నుంచి యూత్ ఫెస్టివల్

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున వర్సిటీ అంతర్ కళాశాలల యూత్ ఫెస్టివల్ ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకు నిర్వహిస్తామని కోఆర్డినేటర్ ఎస్. మురళీమోహన్ తెలిపారు.

న్యూస్‌రీల్

108లో తీసుకొచ్చే రోగులకు సత్వర వైద్య సేవలు



గుంటూరు మెడికల్: 108 వాహనంలో గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు సత్వరమే వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ తెలిపారు. బుధవారం పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాల 108 కో ఆర్డినేటర్లు, ఈసీజీ టెక్నీషియన్లు, సీఎంఓ, ఆర్ఎంఓలతో సమావేశం నిర్వహించారు. డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ రోగుల ప్రాణాలు కాపాడాల్సిన బాధ్యత వైద్యులపై ఉందన్నారు. సమీక్షలో హెచ్‌డీఎస్ కమిటీ మెంబర్ డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్, సీఎస్ఆర్ డాక్టర్ బీవీ సతీష్ కుమార్, డీసీఎస్ఆర్ఎంఓ డాక్టర్ ఝాన్సీరాణి, ప్రొఫెసర్ అండ్ హెచ్ఓడీఎస్‌పీఎం డిపార్ట్‌మెంట్ డాక్టర్ సీతారామ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ బి.ప్రవీణ్ కుమార్, ఏఆర్ఎంఓ డాక్టర్ యు.రాణి, క్యాజువాల్టీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్‌కే నిష్మ, గుంటూర్ జిల్లా 108 సర్వీస్ మేనేజర్ ఎం.నాగదీప్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సౌత్‌జోన్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అథ్లెటిక్స్ అసోసియేషన్(ఏపీఏఏ) ఆధ్వర్యంలో 35వ సౌత్‌జోన్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు ఈ నెల 17వ తేదీ ఉదయం 7.30 గంటల నుంచి ప్రారంభం కానున్నాయి. ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో పోటీలు జరుగుతాయని ఏపీఏఏ కార్యదర్శి ఎ. గౌతమ్ కిరణ్ బుధవారం తెలిపారు. 19వ తేదీ వరకు కొనసాగే పోటీల్లో అండర్- 14, 16, 18, 20 బాలుర, బాలికల కేటగిరీలో పలు క్రీడలు ఉంటాయని చెప్పారు. ఈ పోటీలలో సౌత్‌జోన్‌లోని ఆరు రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతం నుంచి జూనియర్ అథ్లెట్లు పాల్గొంటారని తెలిపారు.

రేపు జాబ్‌మేళా

గుంటూరు ఎడ్యుకేషన్ : గుంటూరు గుజ్జనగుండ్ల సెంటర్‌లోని జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈనెల 18న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కె.రమాదేవి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. హెచ్‌సీఎల్, టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్, ఫెయిర్ డీల్ క్యాపిటల్, సూక్ష్మ ఇనిస్టిట్యూట్ ఆఫ్ జెమాలజీ సంస్థల్లో ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్, డిగ్రీ, బీటెక్, పీజీ విద్యార్హతలు కలిగిన 19 నుంచి 35 ఏళ్ల లోపు వయసు గల నిరుద్యోగ యువతీ, యువకులు బయోడేటా, విద్యార్హతల సర్టిఫికెట్ల కాపీలు, ఆధార్ జిరాక్స్, పాస్‌పోర్ట్ సైజు ఫొటోతో ఉదయం 10 గంటల నుంచి జరిగే ఇంటర్వ్యూలకు నేరుగా హాజరు కావాలని సూచించారు. అభ్యర్థులు ముందుగా ఎంప్లాయిమెంట్.ఏపీ.జీవోవీ.ఇన్ పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని, ఇతర వివరాలకు 98668 22697, 87907 90762, 0863-2350060 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

భవనంపై పడిన పిడుగు



గుంటూరు రూరల్: మండలంలోని గొర్లవారిపాలెంలో బుధవారం సాయంత్రం అకాల వర్షం కురిసింది. ఆ సమయంలో భవనంపై పిడుగు పడింది. గ్రామానికి చెందిన యర్రాకుల శ్రీనివాసరావు భవనం ముందు భాగం పిడుగుపాటుకు పాక్షికంగా ధ్వంసమైంది. ఆ సమయంలో శ్రీనివాసరావు, ఆయన కుటుంబ సభ్యులు ఇంట్లో ఉన్నారు. ఒక్కసారిగా పెద్ద శబ్దం రావడంతో భయాందోళనలకు గురయ్యారు. ప్రాణాలు కాపాడుకునేందుకు తలుపులు వేసుకుని ఇంట్లోనే ఉండిపోయారు. అనంతరం బయటకు వచ్చి చూసేసరికి ఇంటిముందు భాగం, పిట్టగోడ, శ్లాబు పిడుగుపాటుకు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

యార్డుకు 45,003 బస్తాల మిర్చి

కొరిటెపాడు(గుంటూరు): మార్కెట్ యార్డుకు బుధవారం 45,003 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 42,845 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.8,500 నుంచి రూ. 16,200 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,500 నుంచి 18,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 8,200 నుంచి రూ. 16,500 వరకు లభించింది.

ఇసుక కొల్లగొడుతున్నారు



జువ్వలపాలెంలో ప్రభుత్వం కేటాయించిన ఇసుక రీచ్

- సర్కార్ రీచ్‌ల్లోకి నీళ్లు
- అనధికారిక రీచ్‌ల నుంచి ఇసుక అక్రమ రవాణా
- జిల్లాలో అధికారిక రీచ్‌లుగా జువ్వలపాలెం, గాజుల్లంక
- టెండర్లు ఖరారు చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- కృష్ణానదికి 45 వేల క్యూసెక్కులు విడుదల
- ఎగువన నిండిన శ్రీశైలం.. మరో ఐదు రోజుల్లో దిగువకు నీళ్లు
- కృష్ణానది నుంచి ఇప్పట్లో ఇసుక తవ్వకాలకు కనిపించని అవకాశం
- గాజుల్లంక, పెనర్లంక, ఆముదార్లంక ప్రాంతాల్లో అక్రమ తవ్వకాలు
- అక్కడి నుంచి ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్న టీడీపీ నేతలు
- ట్రాక్టర్ ఇసుక రూ. 9 వేలు.. ఆందోళనలో వినియోగదారులు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: ఎగువన వర్షాలు కురిసి కృష్ణానదికి నీళ్లు రావడంతో ప్రభుత్వ అధికారిక ఇసుక రీచ్‌లు ఇప్పట్లో ప్రారంభమయ్యే పరిస్థితి లేకుండా పోవడం పచ్చ పార్టీ ఇసుక దొంగలకు అవకాశంగా మారింది. వాస్తవానికి కృష్ణానది నుంచి ఇసుక తవ్వి వినియోగదారులకు అందించనున్నట్లు చంద్రబాబు సర్కార్ ప్రకటించింది. ఇందుకోసం కొల్లూరు మండలం జువ్వలపాలెం, గాజుల్లంక ఇసుక రీచ్‌లను గుర్తించి తవ్వకాల కోసం టెండర్లు పిలిచింది. రెండు రీచ్‌ల కోసం పది మంది కాంట్రాక్టర్లు టెండర్లు వేయగా టన్ను రూ.115 కు తవ్విపోస్తానన్న ఒంగోలుకు చెందిన తులసి కన్‌స్ట్రక్షన్స్‌కు టెండర్ ఖరారు చేసినట్లు సమాచారం. వాస్తవానికి ఇప్పటికే పై రెండు రీచ్‌ల పరిధిలో నీళ్లు ఉండడంతో మరో 15 రోజుల్లో రీచ్‌లు ప్రారంభించనున్నట్లు అధికారులు ప్రకటించారు. ఇంతలో ఎగువన వర్షాలతో కృష్ణానదికి నీళ్లు రావడంతో మంగళవారం ప్రకాశం బ్యారేజీ నుంచి 45 వేల క్యూసెక్కులు దిగువకు విడుదల చేశారు. మరోవైపు శ్రీశైలం జలాశయం నిండింది. మరో ఐదు రోజుల్లో దిగువన నాగార్జున సాగర్‌కు నీటిని విడుదల చేయనున్నారు. ఇదే జరిగితే దిగువన కృష్ణానదికి పెద్ద ఎత్తున నీరు చేరి ఇప్పట్లో కృష్ణా నది నుంచి ఇసుక తవ్వితీసే అవకాశం ఉండదు.

పచ్చ దొంగలకు అవకాశం

కృష్ణా నదికి నీళ్లు వచ్చి ప్రభుత్వం ఇసుక రీచ్‌లు ప్రారంభించకపోవడం పచ్చ దొంగలకు అవకాశంగా మారుతోంది. గాజుల్లంక, పెసర్లంక ప్రాంతాల్లోని కృష్ణానది ఒడ్డ నుంచి అక్రమంగా ఇసుకను తరలించి అమ్ముకుంటున్నారు. నది శివారు ప్రాంతాల్లో జేసీబీలు పెట్టి ట్రాక్టర్ల ద్వారా కొందరు పచ్చనేతలు ఇసుకను తరలిస్తుండగా మరికొందరు నేతలు వందలాది ఎడ్ల బండ్లు (టైర్ బండ్లు) ద్వారా నది నుంచి ఇసుకను బయటకు తరలించి, అక్కడి నుంచి ట్రాక్టర్లద్వారా ఇతర ప్రాంతాలకు తరలించి అమ్ముకుంటున్నారు. ఎక్కువగా రాత్రిపూట అక్రమ తవ్వకాలకు పాల్పడుతున్నారు. కృష్ణానది నుంచి తవ్విన ఇసుకను కొల్లూరు, వేమూరు, భట్టిప్రోలు, చెరుకుపల్లి, రేపల్లె, తెనాలి తదితర ప్రాంతాలకు తరలించి అమ్ముతున్నారు. ట్రాక్టర్ ఇసుక రూ. 8 నుంచి 9 వేలకు అమ్ముతున్నారు. లారీల ద్వారా బాపట్ల ప్రాంతానికి తెచ్చి 18 టన్నుల లారీ రూ. 35 వేలకు విక్రయిస్తున్నారు.

వేటపాలెం, చినగంజాం నుంచి అక్రమ తరలింపు

బాపట్ల మొదలు చీరాల, అద్దంకి, పర్చూరు నియోజకవర్గాల పరిధిలో అధికారిక ఇసుక రీచ్‌లు లేకపోవడం ఈ ప్రాంత పచ్చ నేతలకు వరంగా మారింది. బాపట్ల, కర్లపాలెం, పిట్టలవానిపాలెం, చీరాల నియోజకవర్గంలోని చీరాల, వేటపాలెంతో పాటు పర్చూరు నియోజకవర్గంలోని చినగంజాం మండలంలో సముద్ర తీరప్రాంతంలోని పలు గ్రామాల్లోని పొలాలు ఇసుక దిబ్బలుగా ఉన్నాయి. ఎకరా పొలంలో వందల ట్రక్కుల ఇసుక లభ్యమవుతోంది. అద్దంకి ప్రాంతంలోని గుండ్లకమ్మ నదిలో పెద్ద ఎత్తున ఇసుక దొరుకుతుంది. దీంతో ఈ ప్రాంతాల్లోని పచ్చ నేతలు ఇసుక అక్రమ రవాణా చేస్తూ పెద్ద ఎత్తున దండుకుంటున్నారు.

ప్రభుత్వ, అసైన్డ్, అటవీ భూములతోపాటు ప్రభుత్వ వరద కాలువలకు గండ్లు తవ్వి ఇసుకను తరలించి అమ్ముకుంటున్నారు. పందిళ్లపల్లి, కడవకుదురు ప్రాంతాల నుంచి లారీలలో ఇసుకను ప్రకాశం, పల్నాడు జిల్లాతోపాటు హైదరాబాద్ ప్రాంతాలకు సైతం ఎగుమతి చేస్తున్నారు. ఇక్కడి నుంచి నిత్యం ఇసుక బాపట్ల ప్రాంతాలకు సరఫరా అవుతోంది. డిమాండ్ నేపథ్యంలో ట్రాక్టర్ ఇసుకను రూ. 7 వేల నుంచి 9 వేలు అమ్ముతున్నారు.



గాజుల్లంకలో ప్రభుత్వం కేటాయించిన ఇసుక రీచ్

అట్రాసిటీ కేసుల్లో బాధితులకు తక్షణ సాయం అవసరం



మాట్లాడుతున్న జేసీ ప్రఖర్‌జైన్

బాపట్ల: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులైన వారికి సత్వరమే న్యాయం చేయాలని జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం జిల్లా స్థాయి నిఘా, పర్యవేక్షణ కమిటీ సమావేశం బుధవారం కలెక్టరేట్‌లో జరిగింది. ఎస్సీ, ఎస్టీలకు జనన ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డులు, రేషన్ కార్డులు తప్పనిసరిగా మంజూరు చేయాలని జిల్లా సంయుక్త కలెక్టర్ తెలిపారు. ఈ చట్టం కింద నమోదైన కేసుల దర్యాప్తు వేగంగా కొనసాగించాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. గత పది నెలల్లో ఈ చట్టం కింద బాపట్ల జిల్లాలో 86 కేసులు నమోదయ్యాయని పేర్కొన్నారు. ఇప్పటివరకు 68 కేసులలో బాధితులకు రూ.33 లక్షల పరిహారం అందించామన్నారు. ప్రాథమిక దర్యాప్తుతో చార్జిషీట్ దాఖలు చేయాలన్నారు. మూడు కేసుల దర్యాప్తునకు హైకోర్టు స్టే ఇచ్చిందని పేర్కొన్నారు. పాత ప్రకాశం పరిధిలోని 138 కేసులు బాపట్ల జిల్లా పరిధిలోకి రాగా.. అవన్నీ కోర్టులోనే పెండింగ్‌లో ఉన్నాయన్నారు. బాధితులకు మేలు చేయడానికే చట్టాలు ఉన్నాయని చీరాల శాసనసభ్యుడు ఎం.మాలకొండయ్య తెలిపారు. మానవతా దృక్పథంతో అధికారులు పనిచేయాలని సూచించారు. చట్టాన్ని పక్కాగా అమలు చేయాలని కమిటీ సభ్యులు కట్టా శ్రీనివాసరావు, జి.రాజారావు, పి.ప్రసాద్ రావు, టి.సురేష్, జి.నాగమణి కోరారు. ఎస్సీ కాలనీలలో మౌలిక వసతులు కల్పించాలని విన్నవించారు. ఈ సమావేశంలో డీఆర్ఓ సీహెచ్ సత్తిబాబు, జిల్లా ఎస్సీ సంక్షేమ సాధికారత అధికారి జె.రాజాదెబోరా, అనుబంధ శాఖల జిల్లా అధికారులు, ఆర్డీవోలు, డీఎస్పీలు తదితరులు పాల్గొన్నారు.

వరదల్లో జాగ్రత్తగా వ్యవహరించాలి



చినగంజాం స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ తుషార్ డూడీ

ఎస్పీ తుషార్ డూడీ సూచన

చినగంజాం: వరద నీటి ప్రవాహాలు దాటే ప్రయత్నం చేసి ప్రమాదాలకు గురి కావద్దని ఎస్పీ తుషార్ డూడీ సూచించారు. చీరాల సబ్ డివిజన్ పరిధిలోని చినగంజాం పోలీస్ స్టేషన్‌లో బుధవారం క్రైం రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ అల్పపీడనం ప్రభావంతో గత రెండు రోజుల నుంచి జిల్లాలో విస్తారంగా కురుస్తున్న వర్షాల కారణంగా వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయన్నారు. కొన్ని చోట్ల వరద నీరు కల్వర్టులు, బ్రిడ్జిలు, రోడ్లపై నుంచి ప్రమాదకరంగా ప్రవహిస్తున్నాయని హెచ్చరించారు. ఆ ప్రదేశాల్లో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు సూచించారు. సమస్య ఎదురైతే 100, 112 నంబర్లకు ఫోన్ చేసి తెలపాలన్నారు. ఇతర శాఖల అధికారులను సమన్వయం చేసుకుంటూ ప్రజలకు పోలీసులు అండగా ఉండాలని కోరారు. ఆయన వెంట ఇంకొల్లు సీఐ వైవీ రమణయ్య, చినగంజాం ఎస్ఐ ఎస్. రమేష్, పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



ఒడ్డున సురక్షితంగా నిలిపిన బోట్లు

తీరప్రాంత గ్రామాల్లో రెవెన్యూ, పోలీసు అధికారులు

చీరాల టౌన్: తీరప్రాంత గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేశామని తహసీల్దార్ కుర్రా గోపీకృష్ణ తెలిపారు. భారీవర్షాలు, ఈదురుగాలులు కురుస్తాయనే హెచ్చరికల మేరకు రెవెన్యూ సిబ్బందితో పోలీసులు కలిసి వాడరేవు తీరప్రాంతంలో పర్యటించారు. మత్స్యకారులు తమ సామగ్రిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. ప్రభుత్వం చీరాలకు ఎన్డీఆర్ఎఫ్ బృందాన్ని పంపింది. వీఆర్వో శేఖర్, పంచాయతీ సెక్రటరీ, సచివాలయాల సిబ్బంది, పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని రైతు మృతి

ఆందోళనతో గుండెపోటుకు గురై డ్రైవరు మృత్యువాత

కర్లపాలెం: ఆర్టీసీ బస్సు సైకిల్‌ను ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ పరిణామంతో ఆందోళనకు గురైన బస్సు డ్రైవర్‌కు గుండెపోటు రావడంతో ఆయన కూడా మృతి చెందారు. ఈ సంఘటన బుధవారం కర్లపాలెంలో చోటుచేసుకుంది. కర్లపాలెం పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు... మంగళగిరి మండలం పెదవడ్లపూడికి చెందిన దాసరి సాంబశివరావు (54) సుమారు 25 ఏళ్లుగా ఆర్టీసీ బస్సు డ్రైవర్‌గా ఉద్యోగం చేస్తున్నారు. ఆయనకు భార్య ధనలక్ష్మి, కుమార్తె నాగదీపిక, కుమారుడు యోగేంద్రకుమార్ ఉన్నారు. సాంబశివరావు మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు డ్యూటీ ఎక్కారు. అదే రోజు రాత్రి రేపల్లెలో నైట్ హాల్ట్ చేశారు. బుధవారం ఉదయం బస్సు రేపల్లె నుంచి చీరాలకు వస్తోంది. కర్లపాలెం శివారు ముకుంద టీస్టాల్ సమీపంలో జాతీయ రహదారిపై వెళుతున్న సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తిని బస్సు ఢీకొంది. తర్వాత అదుపుతప్పి పొలాల్లోకి దూసుకువెళ్లింది. ఈ ఘటనతో ఆందోళనకు గురైన డ్రైవర్ బస్సు దిగగానే గుండెపోటుకు గురై మృతి చెందారు. సైకిల్‌పై ఉన్న కొత్త నందాయపాలెం గ్రామానికి చెందిన పిట్టు వెంకటేశ్వరరెడ్డి (59)కి తీవ్ర గాయాలయ్యాయి. ఆయన్ను బాపట్ల వైద్యశాలకు తరలించి, అనంతరం గుంటూరు తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు. వెంకటేశ్వరరెడ్డికి భార్య పాపాయమ్మ, కుమారుడు సాంబిరెడ్డి, కుమార్తె నాగమణి ఉన్నారు. సాంబిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రవీంద్ర తెలిపారు.



బస్సు పక్కనే విగతజీవిగా సాంబశివరావు

పుట్టెడు దుఃఖం.. పట్టని ప్రభుత్వం

ప్రకృతి కన్నెర్రతో బాధలో ఉన్న రైతులపై మానవత్వం కరువు

- నీట మునిగిన పంటతో అన్నదాతలు కుదేలు
- ప్రహసనంగా నష్ట పరిహారం అందజేత ప్రక్రియ
- పలు కారణాలతో మొండిచేయి చూపుతున్న సర్కారు

వరదలకు పంట మొత్తం మునిగి రూ.వేల పెట్టుబడి నీటిపాలైంది... మళ్లీ పంట వేయాలంటే చేతిలో చిల్లిగవ్వ లేదు.... ఇలా పుట్టెడు కష్టాలలో ఉన్న రైతన్నను అక్కున చేర్చుకుని ఆదుకోవాల్సిన ప్రభుత్వం మాత్రం సాంకేతిక కారణాలతో సాయం అందించటంలో మొండిచేయి చూపుతోంది. క్షేత్రస్థాయిలో అధికారుల తీరు దీనికి అడ్డం పడుతోంది. దీంతో అన్నదాతలు తీవ్ర ఆవేదన చెందుతున్నారు.



పెదమద్దూరు వద్ద నీట మునిగి పూర్తిగా దెబ్బతిన్న పత్తి (ఫైల్)

అమరావతి: గత నెలలో కురిసిన భారీ వర్షాలకు కృష్ణానదికి వచ్చిన వరదలకు రాష్ట్రంలో పలు ప్రాంతాలలో పంటలు నీట మునిగాయి. ఈ నేపథ్యంలో పల్నాడు జిల్లాలో సుమారు 30 వేల ఎకరాల పంటలు ముంపునకు గురయ్యాయి. ఇందులో ఒక్క అమరావతి మండలంలోనే అధికంగా సుమారు 5 వేల ఎకరాల పంట నష్టం వాటిల్లింది. మునిగిన వాటిలో అధిక భాగం పత్తి పైరు కాగా, కొద్ది శాతం ఉద్యాన పంటలు ఉన్నాయి.

రాసిందే రాత..

గత సెప్టెంబరు నెలలో కురిసిన భారీ వర్షాలకు కృష్ణానది ఉప్పొంగడంతోపాటు భారీ వర్షాలకు వివిధ గ్రామాలలో వాగులు ఉధృతంగా ప్రవహించాయి. దీంతో మండలంలోని ఒకట్రెడు గ్రామాలు మినహా అన్ని చోట్ల ఎంతో కొంత పంట నష్టం జరిగింది. మండలంలోని 16 గ్రామాలలో అధికంగానూ, మిగిలిన చోట్ల స్వల్పంగానూ పంటలు నీట మునిగాయి. అధికారులు గ్రామాలలో కొన్ని ప్రాంతాలలో మాత్రమే నీటమునిగిన పొలాలను గుర్తించారనే విమర్శలు వినిపిస్తున్నాయి. మిగిలిన ప్రాంతాలలో పట్టించుకోలేదని రైతులు చెబుతున్నారు. గ్రామంలో నష్టపోయిన రైతులలో కొంతమందికి పరిహారం ఇచ్చారు. మరి కొందరికి మొండిచేయి చూపారు. దీంతో బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కౌలు రైతులకు కార్డులు లేవని, భూ యజమాని పట్టాదారు పాస్‌బుక్ జిరాక్స్‌లు ఇవ్వలేదని, ఈ- క్రాప్ నమోదు కాలేదని , ఈకేవైసీ చేయలేదని, పంట మొత్తం మునగలేదని... ఇలా అనేక కారణాలతో బాధిత రైతులకు అందాల్సిన సాయంలో మొండిచేయి చూపారు. మండలంలో 16 గ్రామాలలో సుమారు 5 వేల ఎకరాలకు పైగా పంటనష్టం వాల్లిందని ప్రాథమిక అంచనా వేసిన వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు సుమారు 3 వేల ఎకరాలకు మాత్రమే పరిహారం ఇవ్వటంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కౌలు రైతులకు సంబంధిత కార్డులు లేక, భూ యజమానులు పట్టాదారు పాస్‌బుక్ జిరాక్స్‌లు ఇవ్వక తీవ్ర నష్టం వాటిల్లింది. రెండోసారి పెట్టుబడికి ప్రభుత్వం సాయం కూడా అందడం లేదు. దీంతో అప్పులు తెచ్చి ప్రత్యామ్నాయ పంటలను వేయాల్సి దుస్థితి ఏర్పడింది.




పరిహారం రాని రైతులతో మాట్లాడుతున్న కౌలు రైతు సంఘం నాయకులు

1,738 మంది రైతులకే పరిహారం

మండలంలో అమరావతి, పెదమద్దూరు, వైకుంఠపురం, నరుకుళ్ళపాడు, చావపాడు, ఎండ్రాయి, మునగోడు, ధరణికోట గ్రామాలతోపాటుగా మొత్తం 16 గ్రామాలలో వ్యవసాయ, రెవెన్యూ శాఖలు 1,738 మంది రైతులకు చెందిన 2,966.5 ఎకరాలకుగాను ఒక్కో ఎకరాకు రూ.10 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించారు. ఇంకా అర్హతలుండి పరిహారం రాని రైతులు సుమారు 600- 800 మంది ఉన్నారు. వీరికి ఎదురుచూపులు తప్పడం లేదు. పొలానికి సంబంధించిన కాగితాలు తీసుకుని సచివాలయాల చుట్టూ నేటికీ తిరుగుతున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా అర్హులైన అందరికీ పరిహారం అందేలా గ్రామాలలో వాకబు చేసి న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

ఎదురు చూసినా అందని పరిహారం



ఈ ఏడాది ఐదున్నర ఎకరాలలో పత్తి సాగు చేశా. ఎకరాకు సుమారుగా రూ.15 వేల వరకు పెట్టుబడి పెట్టా. పైరు పూత పిందెల మీద ఉంది. వరదలు వచ్చి పంటమొత్తం నీటిపాలైంది. మళ్లీ పొలం బాగు చేసుకుని పంట వేయాలంటే సుమారు రూ.50 వేల వరకు అవసరం. అధికారులు పంట నష్టపోయినట్లు రాసుకుని వెళ్లారేగానీ ఇంతవరకు పైసా పరిహారం రాలేదు. పంట వేయటానికి అప్పు చేయాల్సిందే. ప్రభుత్వం నుంచి పరిహారం వస్తుందేమోనని నెల రోజులుగా ఎదురు చూసినా లాభం లేకపోయింది.

– గణపా సైదారెడ్డి, రైతు, మునగోడు, అమరావతి మండలం

యంత్రాంగం నిర్లక్ష్యంతో రైతులకు నష్టం



జిల్లాలో సుమారుగా 30 వేల ఎకరాల పంట నీట మునిగితే 21 వేల ఎకరాలకు మాత్రమే నష్టపరిహారం ఇచ్చారు. మిగిలిన రైతులకు నష్టపరిహారం ఇస్తామని చెబుతూ మీనమేషాలు లెక్కిస్తున్నారు. మా ఆధ్వర్యంలో గ్రామాలలో తిరిగి రైతులతో మాట్లాడితే పలు చిన్న కారణాలతో పరిహారం ఇవ్వలేదని బాధితులు చెప్పారు. కార్డులు, పత్రాలు ఇవ్వాల్సిన ప్రభుత్వ అధికారులే ఇప్పుడు అవి లేవనే పరిహారం రాలేదని చెప్పటం విడ్డూరంగా ఉంది. భూ యజమానులు కూడా కౌలు రైతులకు పరిహారం అందేలా మానవతా దృక్పథంతో వ్యవహరించాలి. ఉన్నతాధికారులు స్పందించాలి.

– వై.రాధాకృష్ణ, జిల్లా కార్యదర్శి, పల్నాడు జిల్లా కౌలు రైతు సంఘం

అంతా పారదర్శకమే!



వ్యవసాయ, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా నీట మునిగిన పంటను గుర్తించాయి. రైతుల సమక్షంలో పారదర్శకంగా వ్యవహరించాం. కొందరికి నష్టపరిహారం రాలేదంటున్నారు. భూ యజమానుల నుంచి పట్టాదారు పాస్‌బుక్ జిరాక్స్ కాపీలు తీసుకురాని వారికి, ఈ క్రాప్ నమోదు లేని వారికి, కౌలు రైతు కార్డులకు నమోదు చేసుకోని వారికి, ఐదెకరాలకు మించి సాగు చేసిన వారికి పరిహారం రాలేదు.

– అహ్మద్, మండల వ్యవసాయ శాఖాధికారి, అమరావతి

క్లుప్తంగా

ఫుట్‌బాల్ జట్ల ఎంపిక వాయిదా

నరసరావుపేట ఈస్ట్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 17వ తేదీన నిర్వహించాల్సిన ఫుట్‌బాల్ జిల్లా జట్టు ఎంపిక పోటీలు వాయిదా పడినట్టు స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి ఎన్.సురేష్ కుమార్ బుధవారం తెలిపారు. నందిగామ జడ్పీ హైస్కూల్‌లో నిర్వహించాల్సిన ఫుట్‌బాల్ అండర్-14 బాల బాలికల జట్టు ఎంపిక పోటీలను వర్షం కారణంగా వాయిదా వేసినట్టు వివరించారు. ఎంపిక పోటీల తేదీలను త్వరలో ప్రకటిస్తామన్నారు.

శ్రీచక్ర సిమెంట్స్‌కు బీఐఎస్ సర్టిఫికెట్



కారెంపూడి: కారెంపూడి సమీపంలోని నరసింహపురిలో ఉన్న శ్రీ చక్ర సిమెంట్స్‌కు బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్స్ సర్టిఫికెట్ లభించడం పట్ల శ్రీ చక్ర సిమెంట్స్ అధికారులు, కార్మికులు బుధవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. వరల్డ్ స్టాండర్డ్ డే సందర్భంగా శ్రీచక్ర సిమెంట్‌కు అత్యున్నత ప్రమాణం కల సిమెంటుగా భారత ప్రభుత్వ సంస్థ గుర్తింపు లభించడం పట్ల వారు సంతోషం వ్యక్తం చేశారు. ఫ్యాక్టరీ ప్రతినిధులు వి. రాజేంద్రప్రసాద్, వి.వి.రవికుమార్, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ బాలమురళీకృష్ణ, సీఎస్ఓ లింగమూర్తి తదితరులు హర్షం వ్యక్తం చేశారు. ఈ విజయం వెనుక యాజమాన్యం కృషి, ప్రోత్సాహం, సాంకేతిక నిపుణులు కార్మికుల నిరంతర కృషి, ముఖ్యంగా వినియోగదారుల ఆదరణ మరువలేనిదని పేర్కొన్నారు.

రేపు జిల్లాస్థాయి చదరంగ పోటీలు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 18న గుంటూరు చౌత్రా సెంటర్‌లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో అండర్-14, 17 బాల, బాలికల జిల్లాస్థాయి చదరంగ పోటీల్ని నిర్వహిస్తున్నట్లు ఫెడరేషన్ కార్యదర్శి మెల్లంపూడి రవికుమార్, పాఠశాల హెచ్‌ఎం షేక్ ఎండీ ఖాసిం బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పోటీల్లో ఎంపికైన విద్యార్థులను జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు వివరించారు. చెస్ బోర్డ్, కాయిన్స్‌ను విద్యార్థులే తెచ్చుకోవాలని తెలిపారు. చదువుతున్న పాఠశాలల నుంచి జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ ఫొటోస్టాట్ కాపీ, స్టడీ సర్టిఫికెట్‌తో ఉదయం 9 గంటలకు హాజరుకావాలని సూచించారు.

బాణసంచా విక్రయాలకు అనుమతి తప్పని సరి

జాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ ప్రఖర్‌జైన్

బాపట్లటౌన్: అనుమతులు లేకుండా బాణసంచా విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్ పేర్కొన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ చాంబర్‌లో జిల్లాలోని పోలీస్, రెవెన్యూ, ఫైర్, మున్సిపల్, అగ్నిమాపక, పంచాయతీ అధికారులతో సమీక్ష సమావేశాన్ని బుధవారం సాయంత్రం నిర్వహించారు. జేసీ ప్రఖర్‌జైన్ మాట్లాడుతూ దీపావళి షాపులు బాణసంచా విక్రయించేందుకు ఆసక్తి కలిగిన వ్యాపారులు తాత్కాలిక కాకర్స్ లైసెన్సల కోసం ఈనెల 20 నుంచి 25వ లోగా మీసేవా, గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు పెట్టుకునే యజమానులు దరఖాస్తుదారుడి చిరునామా పత్రాలు, ఆధార్‌కార్డు నకలు, మూడు ఫాస్‌పోర్టు ఫొటోలు, జనన ధ్రువీకరణ పత్రంతోపాటు ముందుగా వాణిజ్యశాఖ, పోలీస్‌శాఖ, అగ్నిమాపకశాఖ, పంచాయతీ, మున్సిపల్ అధికారులు, బహిరంగప్రదేశాలు, పాఠశాలల్లో ఏర్పాటు చేసే యెడల సంబంధిత స్థల యజమానులు, ఉపాధ్యాయుల వద్ద నుంచి ఎన్‌ఓసీ తీసుకొని దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దుకాణాలు దక్కించుకున్న యజమానులు ఈనెల 29 నుంచి 31వ తేదీ సాయంత్రం 7 గంటల వరకు మాత్రమే విక్రయాలు జరపాలన్నారు. అనుమతులు లేకుండా విక్రయాలు జరిపితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రకృతి వ్యవసాయంలోనూ మహిళలు రాణించాలి

జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న డీఏఓ

కొరిటెపాడు(గుంటూరు): పొదుపు సంఘాల మహిళలు ప్రకృతి వ్యవసాయంలోనూ రాణించాలని గుంటూరు జిల్లా వ్యవసాయ అధికారి (డీఏఓ) నున్న వెంకటేశ్వర్లు సూచించారు. 'మహిళా కిసాన్ దివాస్' సందర్భంగా ఆత్మ, వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో కృషి భవన్‌లో బుధవారం సాయంత్రం మహిళా రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పెట్టుబడి లేని వ్యవసాయం (జడ్‌బీఎన్‌ఎఫ్) చిత్ర నమూనా గురించి మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఏఓ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా తక్కువ పెట్టుబడితో నాణ్యమైన అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. మహిళా రైతులు ఉత్పత్తిదారుల సంఘాలుగా ఏర్పడితే ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయం జిల్లా పాజెక్టు మేనేజర్ కె.రాజకుమారి మాట్లాడుతూ గుంటూరు జిల్లాలో 25 వేల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయంతో పంటలు సాగు చేస్తున్నట్లు వెల్లడించారు. డ్వాక్రా మహిళలు ఏ విధంగా సంఘాలు ఏర్పాటు చేసుకుంటున్నారో అదే మాదిరిగా మహిళా రైతులు కూడా సంఘాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఆత్మ డిప్యూటీ ప్రాజెక్టు డైరెక్టర్ డి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో ప్రకృతి వ్యవసాయాన్ని ముందుకు తీసుకువెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. డాక్టర్ సత్యప్రియ మాట్లాడుతూ మొక్కకు మట్టి ఎంత అవసరమో మనిషికి పురుగు మందుల అవశేషాలు లేని మంచి ఆహారం అంతే అవసరమని పేర్కొన్నారు. అనంతరం పలువురు మహిళా రైతులను సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో పలువురు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, మహిళా రైతులు పాల్గొన్నారు.

ఎరువులు, విత్తన వ్యాపారుల సమస్యలు పరిష్కరించాలి

అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నాగిరెడ్డి



మంత్రి అచ్చెన్నాయుడును కలసి వినతిపత్రం అందజేస్తున్న అసోసియేషన్ నేతలు

కొరిటెపాడు: ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల వ్యాపారుల సమస్యలు పరిష్కరించాలని ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ అండ్ సీడ్స్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వజ్రాల వెంకటనాగిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర సచివాలయంలో వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడును బుధవారం అసోసియేషన్ నాయకులు కలసి వినతి పత్రం అందజేశారు. దీనిపై స్పందించిన మంత్రి మాట్లాడుతూ వ్యాపారుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి కె.విజయకుమార్, ఉపాధ్యక్షుడు సీహెచ్.రవికుమార్, బి.శ్రీనివాసరెడ్డి, కార్యవర్గ సభ్యులు ముక్కు సంజీవరెడ్డి, పి.సత్యనారాయణ, ఎం.సురేష్‌కుమార్ ఉన్నారు.

20న ఉమెన్ బాల్ బ్యాడ్మింటన్ జట్టు ఎంపిక

గుంటూరు వెస్ట్ (క్రీడలు): బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు జిల్లా ఆధ్వర్యంలో సీనియర్ మెన్ అండ్ ఉమెన్ జిల్లా జట్టు ఎంపిక ఆదివారం ఉదయం 8 గంటలకు స్థానిక ఎన్‌జీఓ క్లబ్‌లో నిర్వహించనున్నట్లు జిల్లా కార్యదర్శి ఈ.శివశంకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిక చేసిన జిల్లా జట్టును వచ్చే నెల 8 నుంచి 10 వరకు కర్నూలు జిల్లా నంద్యాలలో జరగనున్న రాష్ట్ర పోటీలకు పంపిస్తామని పేర్కొన్నారు. వివరాలకు 93969 90666 సంప్రదించాలని ఆయన సూచించారు.

రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి



చీరాల రూరల్: రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం సాయంత్రం చీరాల-వే టపాలెం రైల్వే స్టేషన్ల మధ్య చోటు చేసుకుంది. జీఆర్పీ ఎస్ఐ సి.హెచ్.కొండయ్య తెలిపిన వివరాలు.. రైలు పట్టాలపై వ్యక్తి మృతి చెందినట్లు స్టేషన్ మాస్టర్ ఇచ్చిన సమాచారం మేరకు ఘటనా స్థలాన్ని పరిశీలించగా మృతుని వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదు. మృతుడికి 50 ఏళ్లు ఉంటాయని, చెత్త కాగితాలు, ప్లాస్టిక్ బాటిల్స్ ఏరుకునే వ్యక్తిగా ఎస్ఐ అనుమానం వ్యక్తం చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృత దేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించి, కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కళాకారులను ఆదుకునేందుకు కృషి

ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు



కొత్త పరిమళం నాటికలో దృశ్యం

నగరంపాలెం: కళాకారులకు ప్రభుత్వం తరఫున సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తానని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. రాష్ట్ర సృజనాత్మకత సంస్కృతి సమితి, అభినయ థియేటర్ ట్రస్ట్, గుంటూరు ఠాగూర్ మెమోరియల్ ట్రస్ట్, యశోద ఫౌండేషన్ సంయుక్తంగా మార్కెట్ కూడలిలోని శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో మూడు రోజులపాటు జరిగే నారా చంద్రబాబు నాటకోత్సవాన్ని బుధవారం రాత్రి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరవిందబాబు మాట్లడతూ కళలు అంతరించిపోతున్న తరుణంలో మరలా జీవం పోసుకునేందుకు పూర్తి సహకారం అందిస్తానని తెలిపారు. అభినయ ట్రస్ట్ 71వ నాటకోత్సవం నిర్వహణ అభినందనీయమని చెప్పారు. అనంతరం శర్వాణి గ్రామీణ గిరిజన సాంస్కృతిక సంఘం (శ్రీకాకుళం జిల్లా) ఆధ్వర్యంలో 'కొత్త పరిమళం' నాటిక, కేజేఆర్ కల్చరల్ అసోసియేషన్ (సికింద్రాబాద్) 'సాహితీ సూక్తం' సాంఘిక నాటికలు ప్రదర్శించారు. మూడో ప్రపంచ యుద్ధ భయంతో ప్రజల్లో నెలకొన్న భయంపై ప్రదర్శించిన 'కొత్త పరిమళం' నాటిక సభికులను అలరించింది. ఇండియా- పాకిస్తాన్ సరిహద్దు ప్రాంతం దృశ్యాలను కళ్లకు కట్టినట్లు చూయించారు. ఆత్మ హత్యలు, హత్యలు వంటి సామాజిక సమస్యలకు సాహిత్యం ఎటువంటి సమాధానం చెప్పాలనే అంశాలపై 'సాహితీ సూక్తం' ప్రదర్శించారు. నాటకోత్సవంలో భారతీయ విద్యా భవన్ కార్యదర్శి పి.రామచంద్ర రాజు, టీడీపీ అధికార ప్రతినిధి దామచర్ల శ్రీనివాసరావు, రాష్ట్ర మహిళా అధికార ప్రతినిధి గద్దె లక్ష్మి, నాటక ప్రముఖులు ఆలోకం పెద్దబ్బయ్య, వ్యాపారవేత్త నాగళ్ల తిరుపతయ్య, టీడీపీ గుంటూరు కార్యాలయపు కార్యదర్శి కంచర్ల శివరామయ్య, సింగం లక్ష్మీనారాయణ, అభినయ థియేటర్ ట్రస్ట్ సలహాదారులు జొన్నలగడ్డ శ్రీనివాసరావు ప్రసంగించారు. కార్యక్రమాన్ని అభినయ శ్రీనివాస్, క్రోసూరి సుబ్బారావు, గుంటుపల్లి కృష్ణారావు, గుంటుపల్లి రమణ బాబు నిర్వహించారు.

ప్రొఫెసర్ సాయిబాబా మృతికి కేంద్రమే కారణం



నివాళులర్పిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

నరసరావుపేట: పీడిత ప్రజల పక్షపాతి, ఢిల్లీ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ జి.సాయిబాబా మృతికి కేంద్ర ప్రభుత్వమే కారణమని ప్రజాసంఘాల నాయకులు ఆరోపించారు. బుధవారం సాయంత్రం స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఎదుట మృతిచెందిన సాయిబాబుకు ఘన నివాళులర్పించారు. తదనంతరం ప్రజలకు ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈసందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆయనపై ఒక తప్పుడు కుట్ర కేసు నమోదు చేసి పదేళ్లపాటు నాగపూర్ జైలులో నిర్బంధించి ఆయన అనారోగ్యం పాలై అమరత్వం చెందేందుకు కారణమైందన్నారు. వందలాది మంది ఆదివాసులు, మేధావులు ఉపా కేసులు, ఎన్ఐఏ దాడులకు లోనై వివిధ జైళ్లలో మగ్గిపోతున్నారన్నా రు. కొన్నేళ్ల నుంచి జైళ్లలో మగ్గుతున్న కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు దుడ్డు ప్రభాకర్, ఆర్కే భార్య శిరీష, బెల్లాల పద్మ, దేవేంద్ర, శిల్పలను వెంటనే విడుదల చేయాలని కోరారు. వారు ఇప్పటికే అనేక రకాల జబ్బులతో బాధపడుతున్నారని, జైళ్లలో సరైన వైద్య సౌకర్యాలు లేవని, సాయిబాబా మాదిరిగానే వాళ్లకి ప్రాణహాని జరగకుండా కాపాడుకోవాల్సిన అవసరం అందరిపై ఉందన్నారు. ఈ ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకువచ్చి వారందరినీ విడుదల చేయించేందుకు ప్రయత్నించాలని నాయకులు కోరారు. తక్షణమే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వారందరినీ విడుదల చేయాలని, ఉపా చట్టాన్ని, ఎన్ఐఏను రద్దు చేయాలని ప్రజా సంఘల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ, పీకేఎస్ జిల్లా కమిటీ సభ్యులు కంబాల ఏడుకొండలు, కేఎన్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కె.కృష్ణ, ఏపీ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.కోట నాయక్, సీఐటీయూ నాయకులు శిలారు, పౌర హక్కుల సంఘం నాయకులు శికినం చిన్న, ఎంసీపీఐ జిల్లా కార్యదర్శి రెడ్‌బాషా పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో ఎన్నికల నామినేషన్లు



నామినేషన్లు వేసిన పద్మజ ప్యానల్



నామినేషన్లు వేసిన శైలజ ప్యానల్

గుంటూరు మెడికల్: జీజీహెచ్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నర్సుల సంఘం జిల్లా కమిటీ ఎన్నిక కోసం బుధవారం నామినేషన్లు వేశారు. రెండు ప్యానల్స్‌గా నర్సింగ్ సిబ్బంది వేశారు. ఒక ప్యానల్‌కు గతంలో జనరల్ సెక్రటరీగా పనిచేసి గుంటూరు జీజీహెచ్‌లోని ప్రభుత్వ నర్సింగ్ పాఠశాలలో ట్యూటర్‌గా పనిచేసిన వెల్లంపల్లి పద్మజ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈమె జనరల్ సెక్రటరీగా నామినేషన్ వేయగా, నరసరావుపేటలో పనిచేస్తున్న హెడ్ నర్సు ఎస్.కోటమ్మ ప్రెసిడెంట్‌గా, గుంటూరు జీజీహెచ్‌లో స్టాఫ్‌నర్సుగా పనిచేస్తున్న పుల్లగూడ సునీత వైస్ ప్రెసిడెంట్‌గా, పారాబత్తిని హేమలత కోశాధికారిగా నామినేషన్లు దాఖలు చేశారు. ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా గుంటూరు జీజీహెచ్‌లో స్టాఫ్ నర్సులుగా పనిచేస్తున్న ఎం.ఆశాలత, పి.ఫాతిమున్నీసాబేగం, అమ్మిశెట్టి భూలక్ష్మి, జ్వరాల ఆసుపత్రిలో స్టాఫ్‌నర్సుగా పనిచేస్తున్న గోగుల అరుణ, వేమూరులో పనిచేస్తున్న పి.శోభారాణి ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా నామినేషన్లు దాఖలు చేశారు.

- గుంటూరు ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తున్న బెల్లంకొండ శైలజ ప్రెసిడెంట్‌గా ఒక ప్యానల్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈమె ప్యానల్‌లో జీజీహెచ్‌లో పనిచేస్తున్న హెడ్ నర్స్ యాదం అరుణకుమారి సెక్రటరీగా, తెనాలిలో స్టాఫ్‌నర్సుగా పనిచేస్తున్న ఊర్మిళ స్వరాజ్యలక్ష్మి వైస్ ప్రెసిడెంట్‌గా, గుంటూరు జీజీహెచ్‌లో స్టాఫ్‌నర్సుగా పనిచేస్తున్న సి.హెచ్.శాంతిశ్రీ కోశాధికారిగా నామినేషన్లు దాఖలు చేశారు. ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా గుంటూరు జీజీహెచ్‌లో హెడ్‌నర్సుగా పనిచేస్తున్న సీహెచ్.నారాయణమ్మ, స్టాఫ్‌నర్సుగా పనిచేస్తున్న డి.సుజాత, పి.కళ్యాణి గౌరి, సత్తెనపల్లిలో పని చేస్తున్న స్టాఫ్‌నర్సు పి.కుసుమకుమారి, మంగళగిరిలో స్టాఫ్‌నర్సుగా పనిచేస్తున్న షేక్ షబానా సుల్తానా ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా నామినేషన్లు దాఖలు చేశారు. ఈనెల 17న నామినేషన్లు పరిశీలన, 18న ఉపసంహరణ, 23న ఎన్నికలు జరుగనున్నాయి. గుంటూరు కో-ఆపరేటివ్ సబ్ డివిజన్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎం.తులసి బ్రహ్మమ్మ ఎన్నికల అధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. నామినేషన్లు దాఖలు చేసిన అనంతరం పద్మజ ప్యానల్, శైలజ ప్యానల్ పోటాపోటీగా ఎన్నికల ప్రచారం ప్రారంభించారు.

చోరీ కేసుల్లో ఇద్దరు నిందితుల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ వంశీధర్

గుంటూరు రూరల్: చోరీ కేసుల్లో ఇద్దరు నిందితులను నల్లపాడు పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. అడవితక్కెళ్ళపాడులోని పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను సీఐ వంశీధర్ తెలిపారు. ఇటీవల చౌడవరంలోని స్పిన్నింగ్ మిల్లు కార్యాలయం తాళాలు పగలగొట్టి నగదు దోచుకెళ్లిన కేసులో సీసీ ఫుటేజీలు, ఇతర ఆధారాల ప్రకారం చోరీకి పాల్పడింది శారదాకాలనీ 17వ లైనుకు చెందిన మిక్కిలి సందీప్, అదేకాలనీ 13వ లైనుకు చెందిన పఠాన్‌మస్తాన్‌వలిగా గుర్తించినట్లు చెప్పారు. నిందితులను బుధవారం చిలకలూరిపేట రోడ్డులోని వై జంక్షన్ వద్ద అరెస్ట్ చేశామని, విచారణలో చోరీలను ఒప్పుకున్నారన్నారు. దీంతోపాటు మేడికొండూరులోని ఒక ఇంట్లో, ఇతర ప్రాంతాల్లో చోరీలకు పాల్పడినట్లు ఒప్పుకున్నారని సీఐ తెలిపారు. వీరిపై గతంలో నల్లపాడు, మేడికొండూరు పోలీస్ స్టేషన్‌లలో కేసులున్నట్లు చెప్పారు. నిందితుల నుంచి రూ 5,15,000తో పాటు ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులను చాకచక్యంగా అదుపులోకి తీసుకోవడంలో ప్రతిభ చూపిన సిబ్బంది కె. సుబ్బారావు, షేక్ మస్తాన్‌వలి, భీక్షానాయక్, టి. సాంబశివరావును జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, సౌత్ జోన్ ఇంచార్జ్ డీఎస్పీ మల్లికార్జునరావు తదితరులు అభినందించారని పేర్కొన్నారు.

తాడేపల్లిలో ఆగని ఇసుక అక్రమ రవాణా

- పోలీసులను కాపలా పెట్టినా యథేచ్ఛగా దందా
- ట్రాక్టర్, లారీ, పొక్లెయిన్ రికార్డుల స్వాధీనం
- అయినా ఆగని ఇసుక మాఫియా ఆగడాలు
- మరో పొక్లెయిన్‌తో లోడింగ్



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఇసుక లారీ

తాడేపల్లి రూరల్: మండల పరిధిలోని ప్రాతూరు, గుండిమెడ, చిర్రావూరు ప్రాంతాల్లో కృష్ణానదిలో ఇసుక అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట పడలేదు. పోలీసు, రెవిన్యూ శాఖలు సిబ్బందిని క్వారీల వద్ద ఏర్పాటు చేసినా ఫలితం లేదు. అక్రమంగా ఇసుక తరలించేవారు వేరే మార్గాలను వెతుక్కుంటున్నారు. బుధవారం తెల్లవారుజామున తాడేపల్లి పోలీసులు ఒక లారీ, ట్రాక్టర్‌తో పాటులారీలోకి ఇసుక లోడ్ చేస్తున్న జేసీబీ రికార్డులు సైతం స్వాధీనం చేసుకున్నారు. అయితే పంక్చర్ కావడంతో రికార్డు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా పోలీసులు అక్రమంగా ఇసుక తరలిస్తున్న వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తీసుకురాగానే నూతక్కి వెళ్లే డొంకలో డంప్ చేసిన ఇసుక తరలిపోయింది. గతంలో రాజధాని ప్రాంతంలో పలు దొంగతనాల్లో ముద్దాయిగా ఉన్న వ్యక్తి, అతనికి సహకారంగా ఓ పాల వ్యాపారి చిర్రావూరు, రామచంద్రాపురంవద్ద నూతక్కి వెళ్లే డొంకలో డంప్ చేసిన ఇసుకను లారీలకు ఎత్తి విజయవాడకు తరలించారు. తమ వెనుక సీఎంవో ఆఫీసులో ఓ అధికారి ఉన్నాడని, ఎవరూ పట్టుకోరు అంటూ బహిరంగంగా మాట్లాడడం విశేషం. తాడేపల్లి మండల పరిధిలోని చిర్రావూరు, ప్రాతూరు,గుండిమెడ ఇసుక రీచ్‌లలో బందోబస్తు ఏర్పాటు చేసినా ఇతర చోట్ల అక్రమ మార్గాల్లో తరలిపోతోంది. దుగ్గిరాల మండలంలోని గొడవర్రు ఇతర ప్రాంతాల నుంచి ఇసుకను రామచంద్రాపురం, చిర్రావూరు మధ్య అక్రమార్కులు డంప్ చేస్తున్నారు. జేసీబీల ద్వారా వాహనాలకు లోడింగ్ చేస్తూ జేబులు నింపుకుంటున్నారు.

మానవత్వం మరచిన టీడీపీ నాయకులు

- మనిషి చనిపోయినా ఆగని తప్పుడు కేసులు
- ఆరు నెలల తరువాత వైఎస్సార్ సీపీ నాయకులపై ఫిర్యాదు
- జరగని విషయాలను జరిగినట్లు చిత్రీకరణ

సాక్షి ప్రతినిధి, గుంటూరు: అధికారంలోకి వచ్చిన తరువాత టీడీపీ నాయకులు మానవత్వాన్ని కూడా మరచిపోయారు. చనిపోయిన వ్యక్తిపై కనీసం సానుభూతి కూడా చూపించకుండా అందుకు కారణం అయిన వారితో వైఎస్సార్ సీపీ నాయకులపై తప్పుడు కేసులు పెట్టించి రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారు. తప్పుడు కేసులు బనాయించడంపై వైఎస్సార్ సీపీ నాయకులు తీవ్రంగా ఖండిస్తున్నారు. మంగళవారం వైఎస్సార్ సీపీ నాయకులైన మున్నంగి వివేకానందరెడ్డి, జక్కిరెడ్డి వెంకట కృష్ణారెడ్డి, మేకా వెంకటరామిరెడ్డిపై గుట్టుచప్పుడు కాకుండా కేసు నమోదు చేసిన సంఘటన ఆలస్యంగా బుధవారం వెలుగులోకి వచ్చింది. జరిగిన ఈ సంఘటనపై పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు మాట్లాడారు. కుంచనపల్లి వైఎస్సార్ సీపీ నాయకుడు వెంకటరెడ్డి మృతికి కారణమైన వారితో ఇప్పుడు ఎటువంటి గొడవ జరగకపోయినా, జరిగినట్లు తప్పుడు కేసులు పెట్టించారని ఆరోపించారు. ఇలాంటి కేసులు పెట్టడం వల్ల వైఎస్సార్ సీపీ నాయకులు భయపడరని తెలిపారు. మంగళగిరిలో పరిపాలన చేసేందుకు మంత్రి నారా లోకేష్‌కు ప్రజలు మంచి అవకాశం ఇచ్చారని, ఆ అవకాశాన్ని పక్కన పెట్టి రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ తప్పుడు కేసులు పెడుతున్నారని ఖండించారు. ఇలాంటి కేసులు ఎంతోకాలం నిలబడవని, జరిగిన వాస్తవం ఏమిటో అందరికీ తెలుసని తెలిపారు. వెంకటరెడ్డిని ద్విచక్రవాహనంతో ఢీకొట్టిన వారు ఆ రోజు మద్యం మత్తులో ఉండి ఈ సంఘటనకు పాల్పడ్డారని ఆరోపించారు. అనంతరం మణిపాల్ హాస్పిటల్ వద్ద రెక్కీ నిర్వహిస్తే పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. అప్పుడు గానీ ఇప్పుడు గానీ సదరు యువకుల్ని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఏమీ అనలేదని, అది తెలిసి కూడా ఇలాంటి చర్యలకు పాల్పడడం దుర్మార్గమని వారు నేతలు ఖండించారు.

హర్డు కాంపౌండ్‌లో ఆర్డీఓ, డీఎస్పీ పరిశీలన

వెస్ట్ కాంపౌండ్ స్థలాల్లో నిర్మాణాలను నిలుపుదల చేయించాలని ఆదేశాలు



కాంపౌండ్‌లో పర్యటిస్తున్న ఆర్డీఓ మధులత, డీఎస్పీ నాగేశ్వరరావు

నరసరావుపేట: ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని డీమార్టు పక్కనే ఉన్న హర్డు గరల్స్ హైస్కూలు, కళాశాలకు చెందిన బాప్టిస్టు క్రిస్టియన్ వెస్ట్ కాంపౌండ్‌లో స్థలాల వ్యవహారం మరోసారి వెలుగులోకి వచ్చింది. కొన్నేళ్లుగా స్థలాలు తాము కొనుగోలు చేశామంటూ ఆ స్థలాలను ఆపుకున్న వ్యక్తుల్లో ఒకరు డీమార్టు ప్రారంభం కావడంతో తన స్థలంలో నిర్మాణాలు చేసేందుకు పనులు ప్రారంభించారు. అయితే దీనిని వ్యతిరేకిస్తూ హైస్కూలు ప్రిన్సిపాల్ జీపీజే, ఫిజిక్స్ అధ్యాపకులు లివింగ్‌స్టన్, ప్రాపర్టీ ప్రొడక్షన్ కమిటీ అధ్యక్షులు జంగాల నవబాబు ఈ నెల 14న కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో కోర్టు స్టే ఆర్డర్ ఉన్నా నిర్మాణాలు చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. దీనిపై కలెక్టర్ ఉత్తర్వుల మేరకు ఆర్డీఓ కె.మధులత, డీఎస్పీ కె.నాగేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు, తహసీల్దార్ వేణుగోపాలరావు హర్డు కాంపౌండ్ మొత్తాన్ని పరిశీలించారు. కోర్టు స్టే ఉత్తర్వులు ఉన్నందున ఎటువంటి నిర్మాణాలు చేయనీయకుండా చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ, మున్సిపల్ కమిషనర్‌కు సూచించారు.

పల్నాడులో 73.6 మిల్లీ మీటర్ల వర్షం



బుధవారం కోర్టు ప్రాంగణంలోని బార్ అసోసియేషన్ హాలు వద్ద కురుస్తున్న వర్షం

నరసరావుపేట: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో గడిచిన 24 గంటల వ్యవధిలో జిల్లాలో 73.6 మిల్లీమీటర్ల వర్షం కురిసిందని అధికారులు తెలియచేశారు. మొత్తం 28 మండలాలకు గాను 17 మండలాల్లో వర్షం కురిసింది.. కాగా, బుధవారం జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో ఉదయం కొద్దిసేపు ఎండ కన్పించినా మధ్యాహ్నంకు భారీ వర్షం కురిసింది. అప్పటి నుంచి మేఘావృతమై సాయంత్రం వరకు చిరు జల్లులు పడ్డాయి. అత్యధికంగా బెల్లంకొండలో 12.4 వర్షం పడగా, రెంటచింతలలో 2.2, గురజాలలో 3.6, పిడుగురాళ్లలో 6.2, మాచవరంలో 3.4, సత్తెనపల్లిలో 4.8, రాజుపాలెంలో 2.4, బొల్లాపల్లిలో 7.2, వినుకొండలో 5.2, నూజెండ్లలో 8.4, శావల్యాపురంలో 4.8, ఈపూరులో 6.2, రొంపిచర్లలో 0.2, నరసరావుపేటలో 0.6, నాదెండ్లలో 2.2, చిలకలూరిపేటలో 2,2, యడ్లపాడులో 1.2 మి.మీటర్ల వర్షం కురిసింది.